# మబ్బులు వీడిన ఆకాశం

కూర్మాన వెంకట సుబ్బారావు

"అమ్మయ్య! ఇన్నాళ్ళకు నా కోరిక తీరింది... శ్రీవారికి నా మీద దయ కలిగింది..." అంది వసుంధర ఇసుకలో చతికిల పడుతూ.

"ఊ... నాకు తీరికలేక గాని, నీ మాట ఎప్పుడైనా కాదన్నానా?" అన్నాడు భార్గవ్ బుంగమూతి పెడుతూ.

"చూడండీ... విశాఖపట్నంలో ఎన్నో అందమైన ప్రదేశాలున్నాయి. మనకి దగ్గర్లో, అందుబాటులో హాయిని కలిగించే సుందర దృశ్యాలను చూడలేకపోవడం మన దురదృష్టకరం. అర్జీల మీద అర్జీలు పెట్టుకోగా ఇన్నాళ్ళకు శ్రీవారికి ...."

"మరీ నువ్వు అంతగా తీసిపారెయ్యక్కర్లేదు. క్రిందటి సంవత్సరమేగా మీ వాళ్ళు వచ్చినప్పుడు అన్ని ప్రదేశాలు చూపించాను".

"అబ్బా... సంవత్సరం... ఓ పది సంవత్సరాలైనట్టుంది ఇవాళ చూసిన ప్రదేశాలన్నీ చూసి".

"వసూ... ఇంకా ఏవైనా తిందామా?"

"ఇంక నా వల్ల కాదు బాబూ ఇప్పటికే పొట్ట చెక్కలయ్యేలా ఉంది".

"అయితే వెళ్ళిపోదామా?" అన్నాడు భార్గవ్.

"ఇవాళ ఏమైంది మీకు?... ఎక్కడ కూర్చున్నా ముళ్ళమీద కూర్చున్నట్టుగా ఫీలవుతున్నారు?" బుద్ధొచ్చింది. బలవంతాన మిమ్మల్ని ఇంకెప్పుడూ ఎక్కడికీ తీసుకురాకూడదు" విసుక్కుంటూ అంది వసుంధర.

"అదేంలేదు. నీ కోసం ఎంతసేపైనా ఇక్కడ ఉంటాను".

"అదీ అలా రండి దారికి!.... ఇవాళ నా రోజు. సంవత్సరానికో శివరాత్రి. ఈ ఒక్క రోజు మీరు నా మనిషి. మిగిలిన అన్ని రోజులూ మీవే. మూడీగా ఉండకుండా జోకులువెయ్యండి".

"ఊ... జోకులు వేద్దామనుకునే సరికి ఒక్కటీ తట్టవుగా..."

"చూడండి. ఈ ప్రశాంతత, లోన్లినెస్ మీకు ఇంట్లో కుదుర్తుందా...? ఎవరో ఒకరు రావడం, పోవడం, తలుపు తీయడం, వేస్తుండడంతోనే సరిపోతుంది. పోనీ మీకు సరదా కలిగించే విషయాలు నేను చెప్పనా...? అన్నట్టు సునీత గారు విజయవాడ నుండి తిరిగి వచ్చి ఏం కబుర్లు చెప్పారో... ఏమిటో... నాతో ఒక్కటి కూడా మీరు చెప్పలేదు".

రెస్పాన్స్ కోసం భార్గవ్ కళ్ళలోకి చూసింది వసుంధర...

చిన్న తత్తరపాటు కలిగినా కళ్ళలో కనిపించకుండా దాచుకోవడం గమనించింది.

"ఈసారి పెద్దగా ఏ కబుర్లూ చెప్పలేదు".

"బహుశా చెప్పే అవకాశం మీరివ్వలేదేమో శ్రీవారూ..."

"అబ్బే... లేదే..."

"అస్తమానం మీరు వాగడం తప్పించి ఎదుటి మనిషికి కూడా కాస్త మాట్లాడే అవకాశం ఇవ్వాలి మహాశయా..."

కాస్సేపు నిశ్శబ్దం వాళ్ళిద్దర్నీ ఆవహించింది.

భార్గవ్ ఏదో చెప్పాలనుకుంటున్నాడనీ, చెప్పడానికి సాహసించలేకపోతున్నాడనీ, సునిశితమైన తన నేర్పుతో అనుభవం నేర్పిన పాఠాలతో అర్థం చేసుకుంది వసుంధర. "భర్తతో



పదేళ్ళ కాపురం... ఇద్దరి పిల్లలకు తల్లిగా మాతృత్వ వరప్రసాదం... ఏ కొరతా లేని జీవితం. ఊహించిన దాని కంటే ఎక్కువ జీతం. తన లాంటి మధ్య తరగతి కుటుంబంలోని స్త్రీకి భార్గవ్ లాంటి ఖరీదైన వ్యక్తితో ముడిపడడం తన జీవితానికి వరమే మరి. ఇంత అందమైన బంగారు భవిష్యత్తు తను కలలో కూడా ఊహించలేదు..." అనుకుంటూ భార్గవ్ ముఖంలోకి చూస్తూ ముఖంమీద పడ్డ ముంగురుల లోనికి వేళ్ళు పోనిస్తూ ఆనందం నింపుకున్న కళ్ళతో అతని చెంపలను ముద్దుపెట్టుకుంది.

"ఏమిటి వసూ!... ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు?"

"చూడలేకపోతే కళ్ళు మూసుకోమనండి. నా భర్తను నేను ముద్దు పెట్టుకుంటాను, కొరికేసు కుంటాను. అది నా యిష్టం...."

"అంత పని చెయ్యొద్దులే తల్లీ..."

"నాకే నష్టం స్వామీ!.... మీ అందమైన ముఖంలో గుంటలు చూడాలనుకునేటంత పిచ్చిదాన్ని కాను. అన్నట్టు సునీతగార్ని, రాజారావు గార్ని కూడా ఈ రోజు బీచ్‌కి రమ్మంటే సరిపోయేది. అందరం కలిసి సరదాగా ఏ హోటల్లోనో భోంచేసి..."

"రామాయణం అంతా తెలిసి వెనకటికి ఏదో సామెత లాగా... రాజారావు గురించి పూర్తిగా నీకు చెప్పానుగా... సునీతను అతను కేవలం మరబొమ్మ లాగానే చూస్తాడు. తిరుగుడూ, తాగుడూ ఉంటే చాలు. ఇక ఆయనకి ఎవరి అవసరమూ వుండదు. ఆమె కనీస కోరికలు తీర్చాలన్న ఇంగితజ్ఞానం లేకపోవడం బహుశా ఆయన్ను కట్టుకున్నందుకు సునీత చేసుకున్న దురదృష్టమేమో!..."

"పోనీ సునీత గార్ని బీచ్‌కి రమ్మని చెప్పలేకపోయారా?"

"పానకంలో పుడకలాగా మధ్యలో నేనెందుకు అంటుంది. పైగా భర్తగారికి కొండంత అనుమానం కూడా. పెళ్ళయి ఇద్దరు పిల్లల్ని కన్న తర్వాత కూడా ఆమెను ఓ డిటెక్టివ్ షాడో లా అనుసరిస్తూ ఉండేవాడట. అసలు కొన్నాళ్ళు సునీతగార్ని ఎవరితోనూ మాట్లాడనిచ్చేవాడు కాదట. విషపు చూపులు చూసే వాడట. ఎవరితోనైనా మాట్లాడాలంటే ముఖం వాచిపోయేలా ఉండేదట. రెండు సంవత్సరాల పరిచయమా ఇప్పటికీ నేను ఆవిడ మాట్లాడేటప్పుడు ఆయన ఎదురుగా ఉంటే అంతా సెన్సారే..." భార్గవ్‌ని మాటల్లోకి దింప గలిగినందుకు వసుంధర, తనలో తాను మెచ్చుకుంది. భర్త అభిరుచులు తెలుసుకున్న వసుంధరకు భర్తను తన దారిలోకి తెచ్చుకోవడం ఎంతగానో తెలుసు. ఆయన కోసం అవసరమైతే తన ప్రాణాలైనా ఇవ్వాలన్న ఆలోచన వసుంధరకి కలిగింది. భర్త తన ట్రాక్‌లోనికి వస్తున్నందుకు తను చేరవలసిన గమ్యం ఎంతో దూరం లేదని అర్థం చేసుకుంది.

"శ్రీవారూ! భార్యాభర్తలన్నాక మనసులో ఏమీ దాచుకోకూడదు. చూశారా... ఈ రోజు నా కోరికలన్నీ మీతో చెప్పి నా సరదాలు తీర్చుకుంటున్నాను. అలాగే మీరు కూడా మీకేవైనా ప్రాబ్లమ్స్ ఉంటే ఎంచక్కా చెప్పుకుని ...."

"ప్రాబ్లమ్సా... అబ్బే... అబ్బే నాకేమీ లేవు. కోరికలు అంటే గుర్తుకొచ్చింది. కోరికలు లేరని మనుష్యులు మానసికంగా వేదన పడుతుంటారు కదూ!..."

"అవును". ఇంకా ఏమైనా భర్త మాట్లాడతాడేమోనని ఎదురుచూసింది. భర్త మాటల్లోని సెన్సారింగ్ విధానాన్ని అర్థం చేసుకుంది.

"పిచ్చి భార్గవ్ చెప్పాలనుకున్నది నువ్వు చెప్పలేవు. నువ్వే కాదు ప్రపంచంలో ఏ మగాడూ చెప్పలేడు. నిజానికి చదువుకున్న, సంస్కారమున్న ఏ వ్యక్తీ ఎదుటివారి డైరీ చదవకూడదు. నీ మనసు పూర్తిగా చదివి అర్థం చేసుకోలేక డైరీ చదివి అర్థం చేసుకోగలుగుతున్నాను. భార్యగా కొంత అధికారాన్ని అది సంస్కారం కానప్పటికీ హస్తగతం చేసుకుంటున్నాను" అప్రయత్నంగా ఆమె పెదిమలు కనిపించాయి.

వాచీ ఎనిమిది గంటలు చూపించింది.

బాగా ఆలస్యం అయిందని ఇద్దరూ హోటల్ దారి పట్టారు.

* * *

సరిగ్గా పదిహేను రోజులైంది....


భర్త ఆఫీసు నుండి వచ్చేసరికి శ్రీవార్ని చుట్టేసి "అన్నయ్య ఉత్తరం రాశాడు. వదినకు శీమంతం. నేను ఊరెళ్తున్నానోచ్..." అంటూ భార్గవ్ కళ్ళలోని భావాలను చదవసాగింది.

"అయితే నేను రానక్కర్లేదన్న మాట" అన్నాడు భార్గవ్.

"ఇది ఆడవాళ్ళ సంబరం. అంతగా మీరూ రావాలనుకుంటే నాకేం అభ్యంతరం లేదు. పోనీ బ్రతిమలాడి తీసుకువెళ్దామా అంటే ఒక వారం రోజులు జీతం లెక్కకట్టి ఖర్చులన్నీ అకౌంట్ చేసి కంప్యూటర్ టైపులో ఇంతవుతుందని బుద్ధిగా చెబుతారు".

"అయితే నేను పిసినారిననుకున్నావా...? అంతేనన్న మాట నువ్వు నన్ను అర్థం చేసుకున్నది. అనవసరంగా ఏ ఖర్చూ పెట్టడానికి నేను ఇష్టపడనని, అవసరమనుకుంటే ఎన్ని వేలైనా ఆలోచించేదిలేదని నీకు తెలియదా...?"

భార్గవ్ కొంచెం శృతి పెంచే సరికి "చాలు మహాశయా! ఇంక మీ దండకం ఆపండి. వారం రోజులు చేతులే కాల్చుకుంటారో లేక స్నేహితుల ఇళ్ళల్లో విందులే పొందుతారో మీ ఇష్టం. ప్రేమ



టుమారో ఆన్‌వార్డ్స్ యు ఆర్ ఏ ఫ్రీ బర్డ్" అంటూ భార్గవ్ వైపు చూసి అతని కళ్ళల్లో ఈ ప్రపంచంలో ఎవ్వరికీ అర్థంకాని మెరుపు గమనించింది.

ట్రైన్‌కి బయలుదేరే ముందు "ఆరోగ్యం పాడుచేసుకోకండేం. మూడు పూటలా ఠంచన్‌గా భోజనం చెయ్యండి. ఆల్ ది బెస్ట్..." అంటూ శ్రీవారి బుగ్గమీద చిటికవేసి ప్రయాణమయ్యింది.

స్టేషన్‌లో వసుంధరను దింపేసి వచ్చినప్పటి నుండి ఆమె వింత ప్రవర్తన, వింత సంభాషణలు భార్గవ్ స్మృతిపథంలో చోటుచేసుకున్నాయి. సునీత తలంపులు మనసులోకి రాగానే ఆ ఆలోచనలతో కాస్సేపు ఉక్కిరిబిక్కిరై నిద్రలోనికి జారుకున్నాడు భార్గవ్.

మరుసటి రోజు మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతం....

సునీత ఇంట్లో అడుగు పెట్టాడు భార్గవ్.

"రండి... కూర్చోండి... మంచినీళ్ళు ఇమ్మంటారా?" అంటూ సాదరంగా ఆహ్వానించింది సునీత.

భార్గవ్ మంచినీళ్ళు తాగి వసుంధర ప్రయాణం గురించి చెప్పాడు. రాజారావు కూడా ఎటువంటి పరిస్థితుల్లోనూ రావడం జరగదని సునీత మాటలను బట్టి అర్థమైంది భార్గవ్‌కి.

ఎందుకో సునీత ముభావంగా కనిపించింది. ఆమె కళ్ళల్లో ఎప్పుడూ ఉండే వెలుగూ, ఆమెలో ఎప్పుడూ ఉండే లాస్యం అవుపించలేదు భార్గవ్‌కి. ఈ పాటికి తనని చుట్టేసి ముద్దుల వర్షం కురిపించే సునీత కళ్ళల్లో అమావాస్య చంద్రుడు తారట్లాడుతున్నట్టుగా అనిపించి అన్నాడు భార్గవ్.

"ఏమిటి సునీతా అదోలా ఉన్నారు? ఒంట్లో బాగాలేదా...?"

"అబ్బే... అదేం లేదే!... బాగానే ఉన్నాను..." అంది సునీత.

"లేదు. రోజులా లేరు. ఈ రోజు మనసు బాగా లేనట్టుంది..."

"మనసు కదా ... కొంచెం ఒడిదుడుకులు తగిల్తే కంపిస్తుంది..."

"ఈరోజు నేనెంతో సంతోషంగా ఊహించుకున్నాను. అంతా భిన్నంగా కనబడుతోంది. నన్ను మురిపాలతో, వలపు పాలతో మత్తెక్కించే సునీత చెంతనే నేను ఉన్నానా అనిపిస్తోంది..."

సునీత ముఖంలో నుండి ఓ విషాదపు నవ్వొకటి జారిపడింది.

"నాకు నమ్మకం లేదు. ఏదో జరగరానిది జరిగి అది మీ మనసుని వ్యాకులపరచింది. ఎప్పుడూ చక్కని సరస సంభాషణలతో ఎదుటివాళ్లలో తన్మయత్వం కలిగించే మీరు ఇవాళ ఇలా మాట్లాడడం ఆశ్చర్యంగా ఉంది."

"ఒక్కోసారి మనం అనుకున్నవి అనుకున్నట్టుగా జరగవు" అంది సునీత ముక్తసరిగా.

"సునీతగారూ... మన స్నేహం కలిశాక... మన మనసులు దగ్గరైన తర్వాత ఇన్నాళ్ళకు నాకు స్వేచ్ఛ లాంటి ఒంటరితనం లభించింది. ఏదో ఒక విధంగా మీకు, మీ మనసుకి ఊరట కలిగించాలన్న నాకు, ఏది మంచో ఏది చెడో, ఏది న్యాయమో, ఏది అన్యాయమో తర్కించుకున్న నాకు ఒక ఆడదాని స్త్రీత్వానికి జరుగుతున్నది అన్యాయమని, అది జరగకూడదని అనిపించింది. మానవత్వపు పరిధిలో కొన్ని కట్టుబాట్లకు గిరిగీసుకున్న మన లాంటి మధ్య తరగతి మనుష్యులకు అతి దగ్గరలో కనిపించేదే అసలైన న్యాయం... రండి సునీత మనం ఎన్నాళ్ళ నుండో కలలుగన్న ఆనందపు సామ్రాజ్యపుటంచుల్లోకి విహరిద్దాం"

"క్షమించండి భార్గవ్...." అంది సునీత.

అదిరి పడ్డాడు భార్గవ్.

"ఈరోజు నుండి మనం స్నేహితులుగానే ఉండిపోదాం".

ఒక్కసారిగా తల దిమ్మెత్తి పోయినట్లయింది భార్గవ్‌కి.

"సునీత... ఈ మాట మీరంటున్నదే...!?" సంశయంగా పలికాడు భార్గవ్.


"అవును భార్గవ్! తప్పు నాదే... ఎన్నాళ్ళ నుండో పంజరంలో చిలుకలా ఒదిగి బ్రతికాను. మీ స్నేహం నాలో పునరుజ్జీవనం కలుగజేసింది. మీలోని వింత ఆకర్షణ నా స్థితిని కోల్పోయేలా చేసింది. పదేళ్ళుగా పోగొట్టుకున్న అందాల్ని, ఆనందాల లోతుల్ని చవిచూడాలని మనసు వశం తప్పింది. అందుకు మీ సహకారం లభించింది. ఏ ఆలోచనలూ లేని మిమ్మల్ని నా కోసం, నాకు ఉపశమనం కలగడం కోసం మీ సంసార బంధం నుండి గీటు దాటి పైకి వచ్చేలా చేశాను"


"లేదు సునీత గారూ! తప్పంతా మీదే కాదు. రెండు చేతులూ కలిస్తేగాని చప్పట్లు వినబడవు. పొరపాటులో నాకూ భాగముంది".

"లేదు... ఎందుకంటే ఏదో మీ దగ్గర నుండి పొందాలన్న తపనతో మిమ్మల్ని నావైపు తిప్పుకోడానికి అహర్నిశలూ ప్రయత్నించాను. ఏ ప్రయత్నమూ చెయ్యకపోతే బహుశా మీరు నాకు దక్కేవారు కాదేమో...!"

"మరి... సునీత... ఇంతలో మీలో ఈ మార్పు...?!"

"ఓ ఆడదాని మనసు... ఓ మంచి మనసు ముందు ఓడిపోయాను. నిర్మలమైన ఆ స్త్రీమూర్తి నన్ను దారితప్పకుండా కాపాడింది. వయసు మళ్ళుతోంది. ఈ కోరికలు కేవలం మరికొన్ని రోజులే. ఇంతవరకు మలినంకాని ఈ మనసుని పాపపు పరిధిలోనికి తీసుకువెళ్ళి కళంకితం కాకూడదు. భార్గవ్ ఇంతటితో ఆగితే మీరూ,





నేనూ కూడా పాప పంకిలంలో అడుగు పెట్టాల్సిన అవసరం ఉండదు. దయచేసి ఈ మీ ప్రేమమూర్తి అభ్యర్థన మన్నిస్తారు కదూ!... అనవసరమైన తలంపులలోనికి మీ మనసుని తీసుకువెళ్ళి గాయపర్చినందుకు నన్ను క్షమిస్తారు కదూ...!" సునీత భార్గవ్ రెండు చేతులూ పట్టుకుంది.

అప్రయత్నంగా ఆమె కళ్ళల్లో నుండి రెండు కన్నీటి చుక్కలు జాలువారాయి.

"ఇంతకీ ఆ స్త్రీ ఎవరో చెప్పారు కాదు...!" అన్నాడు భార్గవ్.

"చెప్పక తప్పదంటారా?" అంది సునీత.

"అభ్యంతరం లేకపోతే సుమా..."

"మీ భార్య వసుంధర... ఇదిగో ఈ ఉత్తరం చదవండి".

భార్గవ్ ఉత్తరం తీసుకుని చదివాడు.

"సునీత గారూ!

ఈ మధ్యనే యాధృచ్ఛికంగా మా శ్రీవారి డైరీ చదివి వారి అభిరుచులు తెలుసుకోగలిగాను. మీలో ఎవరు ఎవర్ని ఆకర్షించారో, ఎవరి వలన ఎవరు ఆకర్షితులయ్యారో నాకు తెలియదు. కానీ, నాకు తెలిసిన ఒక ధర్మం, ఒక న్యాయం భర్త ఆనందానికి అడ్డుపడకుండా ఉండడమే... ఆయన నన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటున్నారు. నేను కనీవినీ ఎరుగని జీవితాన్ని నాకు ప్రసాదించారు.

## ఫ్లాప్ చేసుకుంటాను..!

కిమ్‌శర్మ బాలీవుడ్ సెక్సీభామగా పేరు తెచ్చుకోగలిగింది కానీ, పాపం హిట్ హీరోయిన్‌గా మాత్రం పేరు తెచ్చుకోలేక పోయింది. 'తుమ్‌సే అచ్చాకౌన్ హై', 'కెహతాహై దిల్ బార్‌బార్' చిత్రాల్లో కిమ్‌శర్మ అందాలు ఆరబోసిన ప్రేక్షకులచే శభాష్ అనిపించుకోవడంలో విఫలమైంది. రాబోయే చిత్రాలు అక్బర్‌ఖాన్ 'తాజ్‌మహల్', 'నెహలేపే దెహలా' చిత్రాలు తప్పక తనను హిట్ హీరోయిన్‌గా నిలబెడతాయన్న నమ్మకంతో ఉంది కిమ్‌శర్మ. ఈ చిత్రాల్లో బాలీవుడ్ ప్రేక్షకులు తనలోని సొంపుసొంపులనేకాక, నటనను చూడగలుగుతారని కిమ్‌శర్మ అంటోంది.

నలుగురి ఆడపిల్లల మధ్యతరగతి సంసారంలో పెళ్ళి జరుగుతుందో లేదో అని దిక్కులు వెదికే మా తల్లిదండ్రులకు ఆశాకిరణంగా నిలిచి కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకుని నన్ను అందలం ఎక్కించారు. ఆ మహనీయుడికి నేనేమిచ్చినా ఋణం తీరదు. అతను ఏ సుఖం పొందినా నాకు సంతోషమే. మన మధ్య జరిగిన ఈ విషయాన్ని ఆయనకు తెలియకుండా ఉంచండి. ఆయనకు కాస్త రిలీఫ్ లభించాలనే నేను పుట్టింటికి వెళ్తున్నాను. దయచేసి ఆయన్ని డిజప్పాయింట్ చేయరు కదూ...!

- వసుంధర"

ఉత్తరం చదివి నిట్టూర్చాడు భార్గవ్.

"తను పుట్టింటికి ప్రయాణమయ్యింది కేవలం మీకు ఒంటరితనం కలిగించాలనే... మీ డైరీ ద్వారా మనిద్దరి మధ్య జరిగిన విషయాలు తెలుసుకుని తన భర్త కోరిక తీర్చాలన్న సత్సంకల్పంతో తన ఆనందాన్ని త్యాగం చేయడానికి. ముందడుగు వేసిన ఈ సమాజంలో నెయ్యి కాగడాలతో వెతికినా కనిపించని స్త్రీ...

ఆమెను మీకు ప్రసాదించిన ఆ దేవుడు అభినందనీయుడు".

భార్గవ్ కళ్ళలోని అశ్రువులు బుగ్గలమీద పడ్డాయి.

"వసుంధర నా భార్య అనడానికి గర్వంగా వుంది సునీత గారూ.. ఆ అమాయకురాలికా నేను అన్యాయం చెయ్యాలనుకుంటున్నాను! ఆమె ముందు తల ఎత్తుకుని నిల్చోవాలంటే సిగ్గుగా ఉంది. అందుకేనా ఆమె వెళ్తూ వెళ్తూ 'ఆల్ ది బెస్ట్' అని చెప్పింది".

"పర్వాలేదు భార్గవ్. మిమ్మల్ని అనుక్షణం కళ్ళల్లో పెట్టుకుని చూసుకునే వసుంధర మిమ్మల్ని ఎప్పుడూ క్షమిస్తుంది. అభిమానంతో, ఆదరణతో చూస్తుంది. ఈ రోజే ఆమెకు టెలిగ్రాం కొట్టి రప్పించండి. మబ్బులు వీడిన ఆకాశం లాంటి స్వచ్ఛమైన మీ మనసులో రేపు మీరు పొందబోయే ఆనందం మీకు మరో శోభనం కావాలి. రేపు సాయంకాలం మీ ఇంటికి వచ్చి మీ భార్యాభర్తలను గదిలోకి పంపే ముత్తయిదువుని, ఏకైక ముత్తయిదువుని నేనే కావాలి".

"అయితే ఈ రోజే వెళ్ళి దగ్గరుండి వసుంధరను తీసుకువస్తాను. రేపు మీ రాక కోసం ఎదురుచూస్తాను సునీతగారూ..." అంటూ అక్కడి నుండి కదిలాడు భార్గవ్ ఆనందం నిండిన హృదయంతో...

## మరో సెక్సీభామ

బాలీవుడ్ హీరోయిన్లకు నటన ఎంత ముఖ్యమో ఎక్స్‌పోజింగ్ కూడా అంతే ముఖ్యం. ఈ విషయాన్ని హృషితా భట్ ఆలస్యంగా తెలుసుకుంది. 'అశోకా', 'దిల్‌విల్ ప్యార్‌వ్యార్' చిత్రాల్లో నటించిన హృషితా భట్ ఆ చిత్రాలు సూపర్ ఫ్లాప్ అవడంతో బాలీవుడ్ ప్రేక్షకుల నాడి ఎటువంటిదని తెలుసుకోగలిగింది. రాబోయే చిత్రాల్లో హృషితా భట్ నటనతోపాటు బిపాసా బసు లెవెల్లో అందాలను ఆరబోయనుంది. ఈ రకంగా బాలీవుడ్‌కు హృషిత మరో సెక్సీ భామ అయిందన్నమాట.

